నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 26 మార్చి 2024 | NIZAMABAD


బోధన్‌లోని రాధాకృష్ణ మందిరం వద్ద హోలీ సంబురాల్లో పాల్గొన్న మహిళలు


నిజాంసాగర్‌లో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు, గ్రామస్తులు


రంగులు చల్లుకుంటున్న యువతులు


నిజామాబాద్‌లో రంగులు చల్లుకుంటూ డ్యాన్స్ చేస్తున్న యువతులు


రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

## నేడు జుక్కల్‌లో బీఆర్‌ఎస్
# లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం

**హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్ పోచారం**

నిజాంసాగర్, మార్చి 25: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో దూసుకెళ్తున్నది. ఇందులో భాగంగా జుక్కల్ మండల కేంద్రంలోని లక్ష్మీకల్యాణ మండపంలో మంగళవారం పార్టీ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జడ్పీచైర్‌పర్సన్ దఫేదార్ శోభ, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, బీఆర్‌ఎస్ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ హాజరుకానున్నట్టు తెలిపారు. బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

# రంగేసి.. చిందేసి..

- అంబరాన్నంటిన హోలీ సంబురాలు
- రంగుల్లో మునిగితేలిన జనం
- వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. కేరింతలు, ఆనందోత్సాహాల మధ్య ప్రజలు హోలీ పండుగను సోమవారం జరుపుకొన్నారు. జనం రంగుల వేడుకల్లో మునిగిపోయారు. పల్లె, పట్టణం ఏ వీధిలో చూసినా హోలీ వేడుకలు కనువిందు చేశాయి. చిన్నారులు, యువతీయువకులు, పెద్దలు రంగుల్లో మునిగితేలారు. చిన్నాపెద్దా కలిసి ఆడిపాడుతూ రంగులు పూసుకుంటూ సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు సైతం హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. రంగులు చల్లుకుంటూ డ్యాన్స్ చేశారు.

– నమస్తే తెలంగాణ యంత్రాంగం


బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న మాజీ స్పీకర్ పోచారం


నిజామాబాద్‌లో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు


కామారెడ్డిలో చిన్నారుల కేరింతలు


హోలీ వేడుకల్లో భాగంగా నిజామాబాద్‌లో డ్యాన్స్ చేస్తున్న యువకులు


నిజామాబాద్ నగరంలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు


బాన్సువాడ మండలం బోర్లం క్యాంపులో సంప్రదాయ నృత్యం చేస్తున్న గిరిజనులు

# సర్కారు వారి నిర్లక్ష్యం

**కాంగ్రెస్ సర్కారు** నిర్లక్ష్యం రైతులను నిండా ముంచుతున్నది. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నది. ధాన్యం సేకరణ ప్రారంభించకపోవడంతో అన్నదాతల రెక్కల కష్టం దళారుల పాలవుతున్నది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే వరి కోతలు ఊపందుకుంటున్నాయి. అయినా ధాన్యం సేకరణకు ప్రభుత్వం ముందుకు రావడం లేదు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదు. ఫలితంగా పల్లెల్లో వాలిపోతున్న దళారులు రైతులను నిలువునా ముంచుతున్నారు. మద్దతు ధర కన్నా తక్కువకే వడ్లు కొంటున్నారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో అన్నదాతలు దళారులు చెప్పిన ధరకే పంటను అమ్ముకుంటున్నారు.

–నిజామాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- దళారుల పాలవుతున్న రైతు రెక్కల కష్టం
- ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న వరి కోతలు
- ధాన్యం సేకరణపై దృష్టి సారించని ప్రభుత్వం
- కామారెడ్డిలో కనీస ఏర్పాట్లు చేయని వైనం
- నిజామాబాద్‌లో సన్నాహక సమావేశానికే పరిమితం
- దిక్కులేక ప్రైవేటుకు విక్రయిస్తోన్న రైతులు

**కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం**

### ఊపందుకున్న కోతలు..

ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ఊపందుకుంటున్నాయి. బాన్సువాడ, జుక్కల్, బోధన్ నియోజకవర్గాల్లో ఎక్కడ చూసినా ధాన్యం రాశులు కనిపిస్తున్నాయి. అయితే, కనీస మద్దతు ధరకు అమ్ముదామనుకున్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి. ధాన్యం సేకరణపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. కొనుగోలు కేంద్రాల విషయమై ఇంత వరకు అతీగతీ లేదు. రోజురోజుకూ వరి కోతలు పెరుగుతుండడంతో ధాన్యం రాక మొదలైంది. కుప్పలు తెప్పలుగా వస్తున్న ధాన్యాన్ని ఏం చేయాలో అర్థం కాక రైతన్నలు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రైతుల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు వర్తకులంతా సిండికేట్‌గా మారి అందిన కాడికి దోచుకుంటున్నారు. రూ.2వేలలోపే క్వింటా ధాన్యాన్ని కొంటుండడంతో రైతులకు నష్టాలు తప్పడం లేదు. వాస్తవానికి వరి గ్రేడ్ ఏ రకం క్వింటాకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183గా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, కేంద్రాలు లేకపోవడంతో వ్యాపారులు తక్కువ ధరకే కొంటున్నారు.

### పట్టించుకునే వారేరి..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ధాన్యం సేకరణకు ముందుగానే ఏర్పాట్లు జరిగేవి. పంట కోతలు ప్రారంభమయ్యేలోపు కేంద్రాలు ఏర్పాటయ్యేవి. అయితే, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ధాన్యం కొనుగోళ్లపై ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. ధాన్యం సేకరణపై నిజామాబాద్ జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన ఇటీవల సన్నాహక సమావేశం జరిగింది. కానీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు మాత్రం కొలిక్కి రాలేదు. ఇక, కామారెడ్డిలో అయితే కనీసం ఈ విషయాన్ని పట్టించుకున్న నాథుడే లేడు.


చందూరులో యాసంగి ధాన్యాన్ని వ్యాపారులకు విక్రయిస్తున్న రైతు

### కామారెడ్డిలో పట్టింపు కరువు..

కామారెడ్డిలో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై పైపై నివేదికల రూపకల్పన మినహా సన్నాహక సమావేశమే జరుగలేదు. పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్‌కు అదనంగా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పోస్టును అప్పగించారు. ఇలాంటి కీలక పరిస్థితిలో ఒక అధికారి రెండు బాధ్యతలు అప్పగించడం, ధాన్యం కొనుగోళ్లు ఏ విధంగా చేపడతారనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కామారెడ్డి జిల్లాలో ప్రొటోకాల్ అంశాలు మినహా ఇక్కడి ప్రజాప్రతినిధులకు కనీసం రైతుల బాధలను పట్టించుకునే ఆసక్తి లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారి ఇబ్బందులను ఆలకించే నాథుడు కూడా లేకుండా పోయాడు. ఓవైపు భూగర్భ జలాలు పడిపోవడం, సాగునీరందక పంటలు ఎండిపోతున్న తరుణంలో.. చేతికొచ్చిన వడ్లను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ఆగమవుతున్నారు.

### బోనస్.. బోగస్

అధికారంలోకి వస్తే వరి క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి వంద రోజులు పూర్తవడం, ధాన్యం రాక మొదలైన తరుణంలో ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది. మరోవైపు, బోనస్ అంశాన్ని పక్కదారి పట్టించేలా ఈ మధ్య కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. కనీస మద్దతు ధర కన్నా తక్కువగా పంట కొనుగోళ్లు జరిగితేనే బోనస్ ఇస్తామని బుకాయిస్తున్నారు. మరోవైపు, లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో రాష్ట్ర సర్కారు బోనస్ విషయంలో తప్పించుకున్నట్లయింది.

### పత్తాలేని కొనుగోలు కేంద్రాలు..

నిజామాబాద్ జిల్లాలో యాసంగిలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.13 లక్షల హెక్టార్లు కాగా, ప్రస్తుతం 1.66 లక్షల హెక్టార్లలో సాగైంది. సుమారు 11.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 7.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం గంగాకావేరి రకం కాగా, మిగిలిన 4.15 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం ధాన్యం వస్తాయని భావిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారుల కొనుగోళ్లు చేయగా, మిగిలిన ధాన్యాన్ని సేకరించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేయబోతున్నట్లుగా వారం క్రితం నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వెల్లడించారు. 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు సర్కారు లక్ష్యంగా పెట్టుకోగా, ఇందుకోసం 462 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో సహకార సంఘాల ఆధ్వర్యంలో 417, ఐకేపీ ద్వారా 39, మెప్మా ద్వారా 6 కేంద్రాలు కొనసాగించేందుకు నిర్ణయించారు. బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో కోతలు షురూ అయినప్పటికీ నిజామాబాద్ జిల్లాలో ఇంత వరకు ఒక్కటంటే ఒక్క కొనుగోలు కేంద్రం ఏర్పాటు కాలేదు. రెంజల్, ఎడపల్లి, బోధన్, వర్ని, కోటగిరి, చందూర్, రుద్రూర్ మండలాల్లో పంట కోతలు వేగంగా జరుగుతున్నాయి. ధాన్యం భారీగా వస్తున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగంలో చలనం లేదు.

## విద్యుత్ ఉపకరణాలు చోరీ చేస్తున్న
# దొంగల ముఠా అరెస్టు

ఆర్మూర్‌టౌన్, మార్చి25: పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల నుంచి విద్యుత్ ఉపకరణాలను దొంగిలిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను సోమవారం స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంతోపాటు పిప్రి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వ్యవసాయ క్షేత్రాల నుంచి స్టార్టర్ బాక్సులు, సబ్‌మెర్సిబుల్ పంపులు, ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలతోపాటు పలు విద్యుత్ ఉపకరణాలను చోరీ చేస్తూ పట్టణంలోని వీక్లీ బజార్ సమీపంలోని వసీమ్(టిల్లిబాబా)కు విక్రయించేవారు. వసీమ్ పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేస్తుంటాడు. కాగా శనివారం రాత్రి పట్టణంలోని జై భవానీ ఆర్డర్ మెస్ ఆవరణలో ఉన్న సబ్‌మెర్సిబుల్ పంపు చోరీకి గురైంది. రాత్రి సుమారు 12గంటల సమయంలో సబ్‌మెర్సిబుల్ పంపును ఎత్తుకెళ్తుండగా నిందితులు ఆర్డర్ మెస్ యజమాని అనిల్ కంటపడ్డారు. అనిల్ ఆదివారం నిందితుల ఇంటికి వెళ్లి తన పంపుసెట్‌ను ఇవ్వాలని కోరాడు. తాము వసీమ్‌కు విక్రయించామని నిందితులు తెలిపారు. పాత ఇనుప సామగ్రి షాపులో ఉందని దానిని ఇప్పిస్తామని అనిల్‌ను షాప్ దగ్గరికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న పలువురు బాధిత రైతులు తాము పోగొట్టుకున్న సామగ్రి కోసం వసీమ్ షాపునకు వచ్చారు. వసీమ్‌కు సంబంధించిన ఇనుప సామగ్రిని, దుకాణాన్ని పోలీసుల సహాయంతో రైతులు తనిఖీ చేశారు. తనిఖీలో లక్షల రూపాయల విలువ గల విద్యుత్ ఉపకరణాలు, బ్యాటరీలు లభ్యమయ్యాయి. చోరీ సామగ్రిని కొనుగోలు చేస్తూ దొంగలను ప్రోత్సహిస్తున్న వసీమ్‌తోపాటు ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీ సొత్తును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవి కుమార్ తెలిపారు.


చోరీ చేసిన విద్యుత్ ఉపకరణాలను పరిశీలిస్తున్న పోలీసులు



# ఊరంతా గుద్దుకున్నారు

బోధన్ రూరల్, మార్చి 25: బోధన్ మండలంలోని హున్సా గ్రామంలో హోలీ పండుగను పురస్కరించుకొని పిడిగుద్దులాటను నిర్వహించారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు గ్రామస్తులు రెండు గ్రూపులుగా విడిపోయి హనుమాన్ మందిరం వద్దకు చేరుకొన్నారు. అడ్డంగా కట్టిన తాడుకు రెండు వైపులా నిల్చొని ముఖాలు, వీపులపై పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఈ ఆట సుమారు ఐదు నిమిషాలపాటు కొనసాగగా..దీనిని తిలకించడానికి సమీప ప్రాంతాలతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర నుంచి ప్రజలు తరలివచ్చారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్, రూరల్ సీఐ నరేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.